# కాలుష్యం

ఆధునికకాలంలో 'కాలుష్యం' పదం చాలా వాడుకలోకి వచ్చింది. పూర్వకాలం 'కల్మషం' అని ఎక్కువ వాడేవారం కానీ 'కాలుష్యం' అర్థం చాలా విస్తృతంగా మారింది. నాగరికత పెరిగినకొలదీ కాలుష్యం పెరుగుతోంది. అనాగరిక జీవనంలో ఈ కాలుష్యం బెడదే లేదు. పచ్చని ప్రకృతి, చక్కటి చల్లగాలి, పవిత్రమైన పంచభూతాలు మనిషికి ఆనందం, ఆరోగ్యం కలిగించేవి. కానీ నేడు కాలుష్యం పెరిగితే ఆరోగ్యం క్షీణిస్తోంది. ఆయుష్షు కూడా నశించిపోతోంది. ఈ కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కూడా ప్రత్యేకశాఖలు నిర్వహిస్తున్నాయి. వాహనాల వల్ల వాతావరణ కాలుష్యం విజృంభిస్తోంది. పొగలు అలలు అలలుగా గాలితో కలిసి ప్రాణవాయువును తగ్గించి దుర్గంధ కల్మష వాయువును మన ఊపిరితిత్తుల్లోకి జారుతోంది. దానితో శరీరంలో అన్నీ రోగాలే! ఒక లారీ వెనుకగాని, ఒక బస్సువెనుకగానీ స్కూటరుమీద వెళ్ళడం కష్టం. రైలుపొగలా వెలిగ్రక్కే ఆ వాహనాల పొగ ముక్కుల్లో, కళ్ళల్లో దూరుతుంది. ఎంత దూరంగా వున్నా మన మీదకు పొగరాకుండా పోదు. బస్సుల్లో, రైళ్ళల్లో, ప్రజా స్థలాలలో పొగత్రాగరాదన్న సిగరెట్లు జనం తాగుతారు. ఆ పొగ మనమీదకు గాలికి వచ్చి మన ఆరోగ్యం చెడగొడుతుంది. పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్ అన్న సామెత ఉండనే వుంది. పొగతాగినవాడు హాయిగా వుంటాడు. తాగనివాడు తాగేవాడి గాలిపీల్చి దున్నపోతులా నల్లగా మారిపోతాడు. పెద్ద నగరాల్లో ఫ్యాక్టరీల పొగలు జీవితాలకే మసిపూసే

స్తుంది. ముఖ్యంగా కలకత్తా, బొంబాయి నగరాల్లో అనేక మేడలు నల్లగా మసిగా కనిపిస్తాయి వికృతంగా.

కాలుష్యం ఇంకా అనేక రకాలు, శబ్ద కాలుష్యం కూడా. మన పక్కింటివాడు ఎప్పుడూ వచ్చి వాగుతుంటాడు. పొమ్మన్నా పోడు. వాడు తన ఇంట్లో కూడా పెళ్ళాంతో వాగుతూంటే మనింట్లోకి వినిపిస్తుంది. ఆ మాటల రణగొణ ధ్వనికి ప్రశాంతతపోయి తలనొప్పికూడా వస్తుంది. అలాగే సంగీత సాధనచేసే పిచ్చివాళ్ళుకూడా. తమకు గాత్రం సరిగా లేదని తెలిసికూడా పాడకుండా ఉండలేరు. పాట భయంకరంగా వాళ్ళు పాడితే ఆ పాట శబ్దానికి కర్ణకఠోర సంగీతానికి నిద్ర లేకపోవడమేకాక తిన్న అన్నం కూడా కక్కుకునేంత స్థితి ఏర్పడుతుంది. ఒకావిడ ఇల్లు అద్దెకిచ్చి రాత్రిళ్ళు సంగీతం పాడుకునేది. ఆవిడ పాట వినలేక, భరించలేక, నిద్రలేక, ఆ శబ్దకాలుష్యం జీర్ణించుకోలేక వచ్చిన అద్దెవాడు ఇచ్చిన అడ్వాన్సు అద్దెకూడా వదులుకుని పారిపోవడం జరుగుతోంది - ఓ పెద్ద మనిషి ఓ ఇటింలోకి అద్దెకు వచ్చాడు. పక్కనే ఫ్యాక్టరీ ఒకటి ఉంది. రాత్రి పూర్తిగా ఆ ఫ్యాక్టరీలో సమ్మెటపోట్ల శబ్దం వినపడుతుంది. ఆ పెద్దమనిషి ఫ్యాక్టరీ సమ్మెటపోట్ల శబ్దం గుండెలమీద తగులుతున్నట్లయి రాత్రుళ్ళు కొంతకాలంగా నిద్రపోలేదు. ఇల్లు ఖాళీ చేయలేకపోయాడు - కొన్నాళ్ళ తర్వాత ఆ శబ్దకాలుష్యంలో కలిసిపోయి ఆ ఫ్యాక్టరీ సమ్మెట పోట్ల శబ్దం లేకపోతే నిద్ర వచ్చేది కాదు. శబ్దకాలుష్యం అలవాటయితే మనిషి జీవితం కూడా చెడులోకి మారిపోతుంది.

మనిషి మనస్సులో కాలుష్యం పెరిగిపోయింది. బాగుపడే పక్కవాడిని చూస్తే అసూయాద్వేషాలతో రగిలి మసిలా మారిపోతుంటాడు. తాను ఇష్టపడిన వ్యక్తిని మరొకరు ప్రేమిస్తే వారి సాన్నిహిత్యం చూసి "ప్రేమించిన వ్యక్తి అసూయతో నలిగినట్లుగా మారిపోయి నిద్రలేకుండా, ఆరోగ్యం చెడగొట్టుకుంటాడు. 'వాతావరణ కాలుష్యం కొంతవరకూ

పోగొట్టడానికి చెట్లు పెంచి ప్రాణవాయువును పెంచవచ్చు. కానీ అసూయాద్వేషాల కాలుష్యంలో మనిషి గిజగిజా కొట్టుకుంటే ఆ కాలుష్యం తగ్గించడం ఎవరితరమూ కాదు. ఆ కాలుష్యం అతని జీవితం కూడా నాశనం చేస్తుంది.

మరో వింత కాలుష్యం, సినిమాల కాలుష్యం. ఆ సినిమా పాటలు ఎక్కడపడితేఅక్కడ మైకుల్లో పెద్దగావిని భరించలేకపోవడం,దేవుడిఉత్సవ మైనా సినిమా పాటలు మైకుల్లో చెవులు అదిరిపోయేలా వినిపిస్తారు. ఉత్స వాలు చేసుకునేవారు తమ పక్కన రకరకాల జనం నివసిస్తున్నారని కూడా మర్చిపోయి పెంకులు ఎగిరిపోయేలా సినిమాపాటలు మైకుల్లో వినిపిస్తారు. వాళ్ళ ఫంక్షన్ అందరికీ తెలయాలని వారి ఉద్దేశం. కానీ ఆ మైకుల గోల భరించలేక రోగాలు తెచ్చుకున్న సంఘటనలు కూడా వున్నాయి.

ఈ రోజుల్లో మరో రకమైన కాలుష్యం వచ్చేసింది - అది కవిత్వ కాలుష్యం. కవిత్వం వ్రాసినవాడు చదవకుండా ఉండలేడు. వినకపోయినా పక్కవాడిని పిలిచి బాధపెట్టి మరీ వినిపిస్తాడు. కవిత్వం - ఇంట్లోవాళ్ళు తన కవిత్వంతో విసుగు కలిగించి భోజనం కూడా మానుకొనే స్థితి సృష్టి స్తాడు - కవి సమ్మేళనాలలో వేచివేచి చివకు మైకు దొరకాక అధ్యక్షుడు ఆగమన్నా ఆగక అలా అనంతంగా కవిత్వంలో అరుస్తుంటాడు కవి. ఆ కవిత్వ కాలుష్యానికి ప్రేక్షకజనం ఉండిఉండి లేచిపోగా, ఉన్న బెంచీలు, కుర్చీలుకూడా పగిలిపోయేంతగా అరుస్తూ కవిగారు కవిత్వ పఠనం మానరు. వాతావరణ కాలుష్యంకన్నా ఈ రోజుల్లో వచన కవితలు పెరిగిపోయాక కవిత్వ కాలుష్యంకూడా పెరిగిపోయింది.

కాలుష్యం లేకుండా ఉండాలంటే మనిషికి అవగాహన ఉండాలి. పక్కవాడి జీవితంలో సంక్షేమం ఉండాలని కోరుకోవాలి. క్రమశిక్షణతో సర్వజన సుఖసంతోషాలు కోరాలి. త్యాగం చేయాలి. ప్రకృతి పులకరిం చేలా దాన్ని పెంచి అభివృద్ధిచేసి అందులో లీనమవ్వాలి. ♦ ♦